ఈనాడు
epaper.eenadu.net

# మెట్రోలో విద్యార్థులకు పాస్‌లు



స్టూడెంట్ పాస్ ఆఫర్‌ను ప్రారంభించిన మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ కేవీబీరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ విద్యార్థుల కోసం స్టూడెంట్ పాస్-2023ని ప్రవేశపెట్టింది. అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో విద్యార్థులతో కలిసి హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ కేవీబీరెడ్డి స్టూడెంట్ పాస్ ఆఫర్‌ను శనివారం ప్రారంభించారు. విద్యార్థి పాస్‌లో భాగంగా 20 ట్రిప్పులకు ఛార్జీలు చెల్లించి అన్ని ఫేర్ జోన్లలో 30 ట్రిప్పులు తిరగవచ్చు. దీనికోసం తప్పనిసరిగా కొత్తగా ప్రవేశపెట్టిన స్టూడెంట్ స్మార్ట్‌కార్డులను కొనుగోలు చేయాలి. పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి 30 రోజుల వరకు మాత్రమే ఇది చెల్లుబాటు అవుతుంది.

● ఒక్కో విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డు మాత్రమే జారీ చేస్తారు. 25 ఏళ్లలోపు వారే దీనికి అర్హులు. జోన్‌ను బట్టి 20 ట్రిప్పులకు కార్డు రీఛార్జ్ చేసుకోవాలి. మొత్తం 10 జోన్లుగా విభజించారు. ఒకటో జోన్ రూ.10 నుంచి మొదలై పదో జోన్ రూ.60గా నిర్ణయించారు. పదో జోన్ అయితే రూ.1200 చెల్లించి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. వివరాలకు www.ltmetro.com సందర్శించవచ్చు. విద్యార్థులకు రాయితీతో పాసులు జారీ చేయడాన్ని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ స్వాగతించారు.

### 40 కోట్ల మందిని గమ్యస్థానం చేర్చిన మెట్రో

ఇప్పటివరకు 40 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానం చేర్చి మెట్రోరైలు మరో మైలురాయిని దాటింది. 2017 నవంబరు 29న మెట్రోరైలు సేవలు మొదలైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రోజుకు 4.90 లక్షల ప్రయాణిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు.

Date : 02/07/2023
EditionName : GREATER HYDERABAD PageNo :